# ప్లీడరిజమ్ vs రౌడీయిజమ్

గుర్రపు బండిచుట్టూ పెద్దగుంపు, దడికట్టారు. లోపల కేకలూ, బొబ్బలూ. దడిచీల్చుకు లోపలికి పోయాను. అన్నీ ఎరిగిన మొహాలే. అంతా మాట్లాడేవాళ్లే. ప్లీడరుశర్మగారు అందర్నీ ఆపి, రంగంలో దిగారు.

"నీ కేమీ దురుద్దేశం లేకపోతే ఆమనిషి, బండా పమని కేకలేస్తే ఎందు కాపలేదూ?"

"గుర్రంకీ ఆగలేదూ సార్! నాకీ ఏంసేస్తాం!" అన్నాడు కాసీం.

"ఆగలేదా? నీకు పొగరెక్కింది! నోటితో 'ట్ల, ట్ల' అంటూ మోచేతుల్తో ఆమెని పొడవలేదా?"

ప్లీడరుగారి క్రాసులో కాసీం పడిపోతా డనుకున్నాను.

"ఏం, హమ్‌గారూ, నీకీ పొడిశానా?—ఫగ్గాలూ లాగుతుంటే సెయ్యి జరా తగిలిందీ ఖామాలు."

ఆడమనిషి ఏమీ సమాధాన మివ్వలేదు. బయటికి పోవటానికి కామాలు రెండు అడుగులు వేసింది, జనం దోవ యివ్వలేదు.

"నువ్వు పొడవటానికి కాకపోతే, 'ఇంకా పైకి, యింకా పైకి' అంటూ ఆమనిషి నీకు తగిలేదాకా ఎందుకు జరగమన్నావు?" ఈమాటకు కాసిం చిక్కా డనుకున్నాను.

"బండ్లీ ఎన్కా బరువూసార్" అన్నాడు కాసీం నవ్వుతూ.

"పద ముందు స్టేషనికి, నీ 'మెన్కా బరువ్రూం బండ్కి', లైసెన్సు ఎలా యిచ్చారో కనుక్కుంటాను!" శర్మగారికి కూడా నవ్వువచ్చింది.

"చూస్కోండి, సార్! ఘోడీ పెద్దది, గాడికీ ఎత్తేసింది."

"ఎక్కడ ఎత్తేసింది. బండి సమానంగా ఉంటే?"

"మీంకీ గాడీ సంగతీ ఏంతెల్సూ సార్, వాడిస్తారూ గాని?"

శర్మగారికి కోపం వచ్చింది.

"రాస్కెల్! పద ముందు పోలీస్ స్టేషనికి. అక్కడ తేల్తుంది, నాకీ తెల్సో, నీకీ తెల్సో!"

"మాటల్ హచ్చా రానియ్యండి, ఫంతుల్ గారూ! తర్వాతా హచ్చా వుండూ."

"హచ్చా గుండకపోతే ఏంచేస్తావోయ్! నడువ్, ముందు స్టేషనికి."

"నాకీ రాను. ఏం సేస్కుంటారో సేస్కోండి!"

శర్మగారు నావంక చూశారు. నేను 'ఎరిగిన ముఖమే కాని, పేరుగుర్తు లే'దన్నా, పేరు మనం చెప్పట మెందుకని.

"రాస్కోండీ, షేఖ్ ఖాసిం. బండినెంబరు 114" అని, కాసిం బండి యెక్కబోతున్నాడు. మా వెనుక ఉన్న రాఘువయ్యనాయుడు హఠాత్తుగా రంగంలో దిగాడు. బండిమీద కాలుపెట్టిన కాసీంని జుట్టుపుచ్చుకుని వెనక్కులాగి, 'ధనధన' నాలుగు వాయించి-"ఫో, రిపోర్టుచేసుకో! నా పేరు రాఘువయ్య, తండ్రి శేషయ్యనాయుడు. యింటిపేరు శీలం" తర్వాత

ఆడమనిషి దగ్గిరికి వెళ్లి—"పదమ్మా, ఇక్కడెందుకూ?" అని, దోవతీసి ఆమెను బయటికి తీసుకెళ్లాడు.

అంతా లైటెనింగ్ వార్ లాగా జరిగింది. కాసింకే కాదు. మా అందరికీ కూడా మతి పోయింది!

"చూశారాబాబూ! నన్నూ అన్యాయంగా కొట్టాడు. మీరూ సాచ్చ్యముండాలా," అన్నాడు కాసిం.

యాసపోకపోయినా, కాసిం ధోరణి చాలా మారింది.

"భేషుగ్గా! మాకళ్లెదుట జరిగింది చెప్పటానికి మాకేం భయం?" అన్నాను. నేను శర్మగారు కూడా అబద్ధం చెప్పనన్నారు.

*

పై ఘటనజరిగి మూడుమాసాలైంది. నాకింతవరకూ ఎలాంటి సమనూ రాలేదు. రాఘవయ్యనాయుడు మాత్రం నేను కనపడితే నవ్వుతూ పోతూఉంటాడు. మొన్న నేను స్టేషనికి పోతూ కాసింబండి ఎక్కాను. వాడు వెనకటి సంగతి ఏమీ తేలేదు. నేను ఎత్తితే-"సూస్కోండి సార్, నాకీ తడాఖా! పదిరోజుల్కి తేలిపోతుంది!" అని జేబులో చాకు తీసి చూపాడు.